క్లుప్తంగా

రెడ్‌క్రాస్ సభ్యులతో సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఐఆర్సీఎస్ నిబంధనల మేరకు పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని తన చాంబర్‌లో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనేజింగ్ కమిటీ కోరం లేకపోతే రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పుదుచ్చేరిలో నిర్వహించిన యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన క్రీడాకారిణి గుంజి కావ్యశ్రీ ప్రథమ స్థానాన్ని సాధించారు. ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి మురళీధరన్, స్పీకర్ సెల్వం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని 29వ డివిజన్లో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను నీలిశెట్టి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. బీజేపీ నేత మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సంఘాలను నిర్వహించాలి



నెల్లూరు (వీఆర్సీ సెంటర్): సహాయ సహకార సంఘాల చట్టాన్ని అనుసరించి మహిళా పొదుపు సహకార సంఘాలను నిర్వహించాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. అనంతబొట్టు కండ్రిగ సంఘ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలను నగరంలోని డీసీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని రేబాల గ్రామంలో యర్రం రెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని జెడ్పీటీసీ సభ్యుడు శివరామకృష్ణారెడ్డి, రియాజ్, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమశేఖర్, హఫీజ్, చెంచయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



కొడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో రైతులకు వరిలో సామూహిక ఎలుకల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ఎలుకల నివారణ రైతులంతా సామూహికంగా చేపడితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. పంటల బీమాకు గడువును ఈ నెల 15వ వరకు పొడిగించారని, బ్యాంక్‌లో రుణాలు పొందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ జి.ఉమామహేష్, సొసైటీ సీఈఓ జి.వంశీకృష్ణ, నాయకుడు వై.వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చట

- అధ్వానంగా రోడ్లు
- బూడిదపాలైన నిధులు
- మరమ్మతుల పేరుతో భారీగా లూటీ
- జిల్లావ్యాప్తంగా రూ.554 కోట్లతో 573 పనులకు ప్రతిపాదనలు
- ప్రస్తుతం రూ.14 కోట్లతో 69 రోడ్డు వర్క్‌లు


రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట ఇలా..

నెల్లూరు (పొగతోట): 'రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.. తాము అధికారంలోకి వచ్చాక వీటిని అభివృద్ధి చేస్తాం' అంటూ బూటకపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ప్రస్తుతం వీటి పరిస్థితి దారుణంగా మారింది. అడుగుకో గుంత దర్శనమిస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా 20 వేల కిలోమీటర్లకుపైగా పంచాయతీరాజ్ రోడ్లు ఉన్నాయి. 1660 కిలోమీటర్ల మేర పనులకు రూ.554 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఎలాంటి రోడ్ల పనులను చేపట్టలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 124 పనులకు అనుమతులను మంజూరు చేశారు. రూ.14.96 కోట్లతో 69 పనులు జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్నాయి. మిగిలిన పనులను ప్రారంభించకపోవడంతో రద్దు చేశారు. వివిధ ప్రాంతాల్లో రూ.14 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు.

రాకపోకలంటేనే హడల్

పనులు నాసిరకంగా ఉండటంతో రోడ్ల పరిస్థితి మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. ఫలితంగా రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. మరమ్మతులు, సిమెంట్, తారు రోడ్లు, దెబ్బతిన్న వాటిని పూర్తిగా తొలగించి గ్రావెల్, తారుతో పూర్తి స్థాయిలో నిర్మించాలంటూ ప్రతిపాదనలను అధికారులు పంపారు. పీఆర్ రోడ్లు ప్రయాణానికే పనికిరావంటూ ప్రతిపాదనల్లో పొందుపర్చారు. అయితే ఎలాంటి అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. తాత్కాలిక మరమ్మతులకైనా నిధులు మంజూరు చేయాలని కోరినా, దాని పరిస్థితీ అంతే కావడం గమనార్హం.


గుంతలమయమైన రహదారిపై రాకపోకలు


బీవీనగర్‌లో దుర్భరంగా..


కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి రహదారిపై గుంతలో ఇరుక్కుపోయిన లారీ

ప్రతిపాదనలు పంపాం

జిల్లావ్యాప్తంగా 1660 కిలోమీటర్ల రోడ్లను నిర్మించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. అయితే ఎలాంటి అనుమతులు మంజూరు కాలేదు. 69 ప్రాంతాల్లో మరమ్మతులు చేపడుతున్నాం. దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని ప్రభుత్వానికి వివరించాం. అనుమతి లభించిన వెంటనే చేపడతాం.

– అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ

ప్యాచ్ వర్కులతో సరి

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వంలో రోడ్లను మెరుగుపర్చామని, కొత్తగా నిర్మిస్తున్నామని టీడీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నా, క్షేత్రస్థాయిలో ఆ ఊసే లేదు. గుంతల రోడ్లకు ప్యాచ్ వర్కులు చేస్తూ ఆహా.. ఓహో అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నెల్లూరు రూరల్ మండలంలో 18 పంచాయతీలున్నాయి. ఇక్కడ రోడ్డు మరమ్మతులను 14 కాంట్రాక్ట్ పనులుగా విభజించారు. 1.6 కిలోమీటర్ల సీసీ రోడ్డుకు గానూ రూ.1.14 కోట్లు వెచ్చించారు. ఇప్పటి వరకు 50 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. టీడీపీ స్థానిక నేతలకే ఈ పనులను అప్పగించారు.

అనుచరులతో పనులు

రూరల్ నియోజకవర్గంలోని ఆర్ అండ్ బీ రోడ్డు ప్యాచ్ వర్కులకు రూ.1.88 కోట్లను కేటాయించారు. తొమ్మిది కాంట్రాక్ట్ పనులుగా విభజించారు. నెల్లూరు నుంచి ముత్తుకూరు.. పొదలకూరు, తాటిపర్తి రోడ్లకు మరమ్మతులు చేశారు. ఇలా దాదాపు 35 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్కులకే పరిమితమయ్యారు. రూ.3.36 లక్షలతో రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. అయితే వీటిని టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి తన అనుచరులతో చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అంతా నాసిరకం

రూరల్ నియోజకవర్గంలోని ప్యాచ్ వర్క్‌లు, సీసీ రోడ్డు పనులను టీడీపీ నేతలకే అప్పగించడంతో నాణ్యత ప్రమాణాలను పాటించడంలేదు. మనల్ని ఎవరాపేదనే ధీమాతో అధికారులను సైతం లెక్కచేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. మీకు అందాల్సిన పర్సంటేజీలు వస్తున్నాయి.. తాము పంపే బిల్లులపై సంతకాలు పెట్టండంటూ హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు బోధ్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

16న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): తిరుపతిలోని బైరాగిపట్టెడ వద్ద గల వైఖానస కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను ఈ నెల 16న నిర్వహించనున్నామని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేద బ్రాహ్మణ ఉన్నత విద్య సహాయక ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల డిగ్రీ ప్రథమ, ద్వితీయ.. ఇంజినీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ చేస్తున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 18లోపు అందజేయాలని, వివరాలకు 98851 99663, 94401 64423 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బెల్టు నిర్వాహకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో గల బెల్టు దుకాణంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, నెల్లూరు – 1 అధికారులు దాడులను బుధవారం చేపట్టారు. నిర్వాహకుడు నాగయ్యను అరెస్ట్ చేసి అతని నుంచి తొమ్మిది క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మకూరులో జాబ్‌మేళా రేపు

నెల్లూరు (పొగతోట): ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ ఫైబర్‌నెట్, ఆరిస్ ఆగ్రో లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ చదివిన వారు హాజరుకావాలని కోరారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి


ప్రదర్శనలను తిలకిస్తున్న స్రవంతి

నెల్లూరు(బృందావనం): యువత ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పురమందిరంలో యువ ఉత్సవ్‌ను నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.. భూకంపాల నుంచి సురక్షితంగా బయటపడటం.. బయోగ్యాస్ ద్వారా విద్యుదుత్పత్తి తదితర అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైన్స్ మేళా, మొబైల్ ఫొటోగ్రఫీ, యువ రచయితలకు చిత్రలేఖన, సాంస్కృతిక ప్రదర్శల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారాల్లో దర్శనం


కాళీయమర్దనాలంకారంలో రంగడు


యోగ నరసింహుడిగా వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు కాళీయమర్దనాలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దొంతంశెట్టి బలరామయ్య, వెంకటనరసింహులుగుప్తా వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు యోగనరసింహస్వామి అలంకారంలో అనుగ్రహించారు. ఉభయకర్తగా కొల్లూరు బాలాజీ వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్లు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇద్దరు రోగులకు సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన ఖరీదైన ఆపరేషన్లను ఉచితంగా చేశారు. దీనికి సంబంధించిన వివరాలను రోగులతో కలిసి యురాలజీ డాక్టర్ జయరాజ్, డాక్టర్ సాయికృష్ణ బుధవారం వివరించారు. రాపూరు మండలం గోనుపల్లికి చెందిన ఒంటరి మహిళ యేలూరుకు కిడ్నీలు పాడై డయాలసిస్‌ను కొంతకాలంగా చేయించుకుంటున్నారని చెప్పారు. డయాలసిస్ కోసం చేతికి ఫిస్టులా ఆపరేషన్‌ను చేయించుకొని సూదిని అమర్చుకున్నారని తెలిపారు. అయితే దీన్ని అమర్చిన రక్తనాళం బెలూన్లా ఉబ్బిపోయి.. లోపల పగిలిపోయి.. రక్తం అంతర్గతంగా కారి గడ్డకట్టి మోచేతి వరకు చేయి వాచిపోయిందని తెలిపారు. అది ఇన్‌ఫెక్షన్‌కు దారితీసిందని, ఈ క్రమంలో పెద్దాస్పత్రికి పది రోజుల క్రితం వచ్చారని వివరించారు. కిడ్నీ జబ్బుతో పాటు గుండె సమస్య ఉందనే విషయం తేలిందన్నారు. తాము రిస్క్ తీసుకొని అనస్థీషియా హెచ్‌ఓడీ శ్రీనివాసరావు సహకారంతో ఆమెకు ఎన్యూరిజమ్ లైగేజిన్ రిపేర్ అనే శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామని వివరించారు. రూపాయి ఖర్చులేకుండా సర్జరీ చేసి రోగి ప్రాణాలను కాపాడామని తెలిపారు.

- బాలాజీనగర్‌కు చెందిన ఉదయగిరి పెంచలయ్య, రాములమ్మ కుమారుడు అరవింద్‌కు మూత్రం పోసే మార్గం పూర్తిగా మూసుకుపోయిందని, దీంతో మూత్ర సంచి నిండి కిడ్నీ వైపునకు వెళ్లిందని చెప్పారు. ఆలస్యం చేస్తే కిడ్నీలు ఫెయిలై ప్రాణాపాయం సంభవించేదన్నారు. ఇలాంటి స్థితిలో పెద్దాస్పత్రికి అరవింద్‌ను తల్లిదండ్రులు వారం క్రితం తీసుకొచ్చారని తెలిపారు. తాము అన్ని పరీక్షలు చేసి, నోటిలో మ్యూకస్ మెంబ్రేన్‌ను తీసి మూత్రం పోయేదారిలో అతికించి యూరిత్రోప్లాస్టీ అనే ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి కాపాడామని పేర్కొన్నారు. ఆపరేషన్‌ను ఉచితంగా నిర్వహించి డిశ్చార్జి చేస్తున్నామని వివరించారు. పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్ర, అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): మహర్షి యోగా జ్ఞాన కేంద్ర నూతన సంవత్సర క్యాలెండర్లను నగరంలోని మూలాపేటలో గల ఆయుర్వేద ఆస్పత్రిలో బుధవారం ఆవిష్కరించారు. జిల్లా ఆయుర్వేద వైద్యాధికారి గోవిందయ్య, యోగా గురువు ముత్యాల రవీంద్ర, డాక్టర్ సుధారాణి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల అందజేత



నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చి వద్ద పేదలకు దుస్తులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. రూథర్ శామ్యూల్, మహిళా విభాగ అధ్యక్షురాలు స్వాతిక, విజయకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని మోపొద్దు

నెల్లూరు రూరల్: సర్దుబాటు చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై భారాన్ని మోపొద్దని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నగరంలోని విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌కు వినతి పత్రాన్ని బుధవారం ఆయన సమర్పించారు. నీలిశెట్టి లక్ష్మణరావు, నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి


సిబ్బందికి సూచనలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. బీవీనగర్, కేఎన్నార్ పాఠశాల రోడ్డు, లెప్రసీ హాస్పిటల్ రోడ్డు, 22 / 1 మదర్‌థెరీసా సచివాలయం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. స్థానిక బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి వంటశాలలోని భోజనాన్ని రుచి చూశారు. విధి నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్లపై ఉన్న గుంతల వద్ద ప్యాచ్‌వర్క్‌లను వేగవంతంగా పూర్తి చేసి కల్వర్టుల ఎత్తును రోడ్డుకు సమాంతరంగా నిర్మించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులు నిరంతరం జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల మస్టర్‌ను తనిఖీ చేసి ఆప్రాన్లను అందజేశారు. ప్రతి విద్యుత్ స్తంభానికీ లైట్లను ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను అమర్చాలని చెప్పారు. హెల్త్ ఆఫీసర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే నిర్మాణాలు జరగాలి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను పరిశీలించాకే ఇదర విభాగాలు అనుమతులను మంజూరు చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ, విద్యుత్, ఫైర్, నగరపాలక సంస్థ విభాగాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను వినియోగించకూడదని స్పష్టం చేశారు. ఈ సర్టిఫికెట్‌ను పరిశీలించాకే అనుమతులను మంజూరు చేయాలని ఫైర్, విద్యుత్, ఇతర విభాగాల అధికారులకు సూచించారు. ఆస్పత్రులు, కళాశాలలు పార్కింగ్ స్థలాలను కేటాయించకుండా.. ఫైర్ సేఫ్టీ అంశాలను నిర్లక్ష్యం చేస్తూ నిర్మాణాలు జరుపుతున్నారనే అంశం తన దృష్టికి వచ్చిందని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వాణిజ్య భవనాలు, కళాశాలలు, ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్‌ను నిర్వహించాలని చెప్పారు. డీఎంహెచ్‌ఓ సుజాత, హెల్త్ ఆఫీసర్ చైతన్య, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, విద్యుత్ ఈఈ శ్రీధర్, అగ్నిమాపక శాఖకు చెందిన వేణుగోపాల్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ పద్మజ, ఏసీపీలు వేణు, ప్రకాష్ పాల్గొన్నారు.

వాకర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు హాజరయ్యారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా పలగాటి శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శిగా గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారిగా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా తలపనేని హరిబాబు, జాలీ వాకర్‌గా మన్నేపల్లి సురేష్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. డిస్ట్రిక్ట్ – 203 ఎలక్ట్ గవర్నర్, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు నలుబోలు బలరామయ్యనాయుడు, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రామయ్యబడి ఫీడర్‌లో కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేయనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండదిబ్బ, అలంకార్ సెంటర్, రాజావారివీధి, బ్రాహ్మణవీధి, శివాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

నెల్లూరు(బారకాసు): అనధికార లేఅవుట్లపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని నుడా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. 38 మండలాల్లో 265 అనధికార లేఅవుట్లను గుర్తించామని చెప్పారు. వీటిని తొలగించేందుకు గానూ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. సీపీ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

15న తెప్పల పోటీలు



నెల్లూరు(సెంట్రల్): పొదలకూరు రోడ్డులోని లేక్‌వ్యూ కాలనీ వద్ద చెరువులో తెప్పల పోటీలను ఈ నెల 15న నిర్వహించనున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బోట్ షికారు ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు **దూదల నిరంజన్, తండ్రి. ప్రసాద రావు,** బుజబుజ నెల్లూరు, నెల్లూరు (రూరల్), నెల్లూరు జిల్లా వారి అనుమతి మేరకు యావన్మందికి తెలియజేయునదేమనగా ఈ షెడ్యూలు దాఖల ఆస్తిని **షేక్ యాస్మిన్ బాబు, భర్త. షేక్ నజీర్ అహ్మద్,** కుమ్మరవీధి, పెద్ద బజార్, నెల్లూరు వారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారు.

సదరు **షేక్ యాస్మిన్ బాబు** క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని **మలిశెట్టి శశికళ, భర్త. సత్యనారాయణ,** డొంకపల్లి గ్రామం, పొదలకూరు మండలం, నెల్లూరు జిల్లా వారి వద్ద నుండి రిజిస్టార్ విక్రయ పత్రం **తేది.04.10.2016, డాక్యుమెంట్ నెం.7308/2016** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు శశికళ ఈ షెడ్యూలు దాఖల ఆస్తిని గండవరపు సుబ్బమ్మ, **భర్త. జయరామి రెడ్డి,** లేక్ వ్యూ కాలనీ, నెల్లూరు వారి వద్ద నుండి **రిజిస్టార్ విక్రయ పత్రం తేది.25.03.2013, నెం.809/2013** ద్వారా కొనుగోలు చేసినారని సదరు **సుబ్బమ్మ** ఈ క్రింద షెడ్యూలు దాఖల ఆస్తిని **తీగల సుబ్బరామయ్య, ఉరఫ్ చిన్న సుబ్బారావు గారి** నుండి రిజిస్టార్ విక్రయ పత్రం **తేది.23.04.1990, డాక్యుమెంట్ నెం.2444/1990** ద్వారా కొనుగోలు చేసిందని, సదరు అసలు విక్రయం పత్రం నెం.**2444/1990** రు సదరు **మలిశెట్టి శశికళ గారి** వద్ద పోయినది మరియు ఈ షెడ్యూలు దాఖల ఆస్తిపై ఎటువంటి వరాదినములు, ఆరోపణలు, వ్యవహారములు, క్లెయిములు, లీజులు, జప్తులు, అగ్రిమెంట్లు లేవని చెప్పుచున్నారు. కావునా ఈ షెడ్యూలు దాఖల ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన తేది నుండి 10 దినములలోగా లిఖితపూర్వకముగా సరియగు ఆధారాలతో తెలుపుకొనవలసింది. తదుపరి ఆక్షేపణలు నా క్లైయింటుని బద్దగించవు / చెల్లనేరవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, బుజబుజ నెల్లూరు సబ్ రిజిస్టారులో చేరిన వెంకటాచలం మండలం, చెముడుగుంట పంచాయితీలో చేరిన, చెముడుగుంట మజరా బురాన్‌పూర్ గ్రామంలోని నెం.447రు పట్టా దాఖలా సర్వే నెం.516-1సి రులో యు2-00 ట్లులో యు 1-10 ట్లు భూమి లే-అవుట్ చేయబడి అప్రూవ్ కాబడిన ప్లాన్ దాఖలా ప్లాట్లలో నెం.103 రు ప్లాటుకు హద్దులు : తూర్పు : నెం.104రు ప్లాటు, దక్షిణం : నెం.110రు ప్లాటు, పడమర : నెం.102రు ప్లాటు, ఉత్తరం : 25 అడుగులు వెడల్పు గల లే-అవుట్ రోడ్డు.

యీ హద్దులలోని 33.33 అంకణములు లేక 266.66 చదరపు గజములు స్థలం.

ఇట్లు, పెనుబాక గంగాధరరెడ్డి, B.Com., B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు-3, సెల్ : 98493 49333